నవభూమి
నల్లగొండ
అనుబంధం
06 అక్టోబర్,2024 ఆదివారం పేజిలు:5
www.epaper.navabhoomi.in








## అన్నపూర్ణ దేవి అవతారంలో

# దుర్గామాత



2

## గౌతమి గ్రామర్ స్కూల్ రజతోత్సవ సంబరాలు



3

# ఘనంగా గడ్డం వెంకటస్వామి జయంతి

**భువనగిరి:-నవభూమి:** కేంద్ర మాజీ మంత్రి, పార్లమెంట్ సభ్యులు గడ్డం వెంకటస్వామి 95వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్..వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జైపాల్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ శ్యామ్ సుందర్, జిల్లా పంచాయితీ అధికారి సునంద, కలెక్టరేట్ ఏఓ జగన్ మోహన్ ప్రసాద్, అధికారులు , ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.తహసీల్దార్ల బదిలీలు భువనగిరి: యాదాద్రి భువనగిరి జిల్లాలో నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ హనుమంతు కే జండగే ఉత్తర్వులు జారీ చేశారు. ఆలేరు తాసిల్దార్ పీ శ్రీనివాస్ రెడ్డి కలెక్టరేట్లో సూపరింటెండెంట్ భువనగిరి తహసిల్దార్ అంజిరెడ్డిని ఆలేరు తహసీల్దారుగా, భూదాన్ పోచంపల్లి తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డిని భువనగిరి తహసీల్దార్ గా నియమించారు. గత కొన్ని రోజులుగా సెలవుల్లో ఉన్న కలెక్టరేట్ సూపరిండెండెంట్ ఎం. మహేందర్ రెడ్డిని భూదాన్ పోచంపల్లి తహసీల్దార్గా నియమించారు.రహదారులను మెరుగు పరుస్తాం: ఎమ్మెల్యే రహదారులు మెరుగుపరిస్తేనే అభివృద్ధి పరితగట్టిన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి నియోజకవర్గంలో పలు మండలాల్లో ట్రైబల్ వెల్ఫేర్ నిధుల నుంచి మంజూరైన రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తామని అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. బీబీనగర్ మండలంలో ట్రైబల్ వెల్ఫేర్ నిధుల ధ్వార (నాలుగురోడ్లు) రూ. 9కోట్ల 80లక్షల రూపాయలతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గొల్లగూడెం – అనాజీపురం బీటీ రోడ్డుకు నీలంబావి వద్ద 2కోట్ల 10లక్షల నిధులతో, సూరెపల్లి – చందుగానీ తండా బీటీ రోడ్డుకు చందుగానీతండా వద్ద 3కోట్ల 15లక్షల నిధులతో ముగ్దుంపల్లి – రామునిగుండ్ల తండా రోడ్డుకు రామునిగుండ్ల తండా వద్ద 2కోట్ల 45లక్షల నిధులతో చిన్నరావులపల్లి – సీనాతండా బీటీ రోడ్డుకు సీనాతండా వద్ద 2కోట్ల 10లక్షల నిధులతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు పెరిగేలా చూడాలి ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు పెరిగేలా వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు.శనివారం నాడు ఆయన బీబీనగర్ మండలం కొండమడుగు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఓపి పేషెంట్లు, వారికి అందిస్తున్న చికిత్స వివరాలను రిజిస్టర్లను పరిశీలించారు. జ్వరం కేసులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. అవసరమైన చోట ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని సూచించారు. ఈ మాసంలో ప్రసవం అయ్యే గర్భిణీ స్త్రీల వివరాలను అడిగారు. సాధారణ ప్రసవం అయ్యేలా వైద్య సిబ్బంది



క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. మెడిసిన్స్ స్టాక్ పరిశీలించారు.వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్రవణ్ కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి తమకు కష్టం బిల్లింగ్ బకాయిలు చెల్లించడంతోపాటు సమస్యలను పరిష్కరిస్తేనే వానకాలం సీజన్లో సీఎంఆర్ ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటామని యాదాద్రి భువనగిరి జిల్లా మిల్లర్లు స్పష్టం చేశారు ఈ మేరకు శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ హనుమంత్ కి జెండగేను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం నుంచి గత కొన్ని నీళ్లుగా సీఎంఆర్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించానన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే తాము మిల్లులో నడిపించే పరిస్థితిలో లేమన్నారు. అదేవిధంగా రవాణాచార్జీలను కూడా చెల్లించాలని కోరారు. 25 సంవత్సరాల క్రితం నిర్ధారించిన బిల్లింగ్ చార్జీలను ఇప్పుడు ఇస్తున్నారని, పెరిగిన విద్యుత్ చార్జీలు ఇతర ఖర్చులను దృష్టిలో పెట్టుకొని పెంచాలన్నారు. జిల్లా కార్యవర్గంలో తీసుకున్న నిర్ణయం మేరకు తాము ఈ వినతి పత్రం సమర్పిస్తున్నామన్నారు. వరి సాగులో కొత్త కొత్త వెరైటీలు ఉత్పత్తి అవుతున్నందున తగ్గించాలనిసూచించారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మార్తా వెంకటేశం, కార్యదర్శి కోట మల్లారెడ్డి, కోశాధికారి గౌరిశెట్టి అశోక్, ఉపాధ్యక్షుడు నూనె వెంకటేశ్వర్లు, డైరెక్టర్ రామ్మోహన్ మాజీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం సంయుక్త కార్యదర్శి జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.వీరలక్ష్మీగా స్వరూపినిగా పద్మావతి అమ్మవారు స్వర్ణగిరి క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంబరాన్ని అంటుతున్నాయి. ఉత్సవాలలో మూడవ రోజైన నేడు శ్రీ పద్మావతి అమ్మవారిని ఆలయంలోని లక్ష్మి మంటపంలో కొలువుదీర్చి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం





నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వీరలక్ష్మి స్వరూపంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలుగచేశారు. తదుపరి మహాలక్ష్మి హవనం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.సాయంత్రం వీరలక్ష్మి అమ్మవారికి తిరువీధి ఉత్సవం నిర్వహించి సహస్రదీపాలంకార సేవలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.శనివారం కావడంతో స్వర్ణగిరి భక్తులతో కిట కిట లాడినది.. భక్తులు అష్టలక్ష్మి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి కుంకుమార్చనలు, తులాభారం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

# అన్నపూర్ణ దేవి అవతారంలో దుర్గామాత

- అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న బొబ్బల జైపాల్ రెడ్డి దంపతులు.
- మద్దెలమ్మ దేవి ఆలయంలో లక్షపుష్పార్చనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు శ్రీనివాస్ దంపతుల





**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి అక్టోబర్ 05** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో శనివారం దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అన్నపూర్ణాదేవి అవతారంలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా స్థానిక మధ్యలో మా దేవి ఆలయంలో అన్నపూర్ణ అవతారంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లక్ష పుష్పార్చన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్ దంపతులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యనారాయణ దంపతుల లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా అత్యధిక సంఖ్యలో మహిళా భక్తులు కార్యక్రమంలో పాల్గొనగా అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తులకు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సురపల్లి రాము, ఉపాధ్యక్షులు చింతకింది ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కడివేరు రమేష్ , సహాయ కార్యదర్శి సీత రాజేంద్రప్రసాద్, కోశాధికారి తడక వెంకటేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. స్థానికఅయ్యప్ప స్వామి దేవాలయం లో ఆవరణలో అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణాదేవి అవతారంలో భాగంగామహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు మహా అన్నదాతగామండల గురుస్వామి కీర్తిశేషులు మల్లారెడ్డి కుమారుడు బొబ్బల జైపాల్ రెడ్డి ,పావని దంపతుల చేత మహా అన్నదానాన్ని కార్యక్రమాన్ని భక్తులకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గంగాపురం దోర్నాల గణేష్,పగిడిమర్రి రాజు,శెట్టి శ్రీనివాస్,తండ కిషన్,కర్నాటి చందు,బొడిగ లింగం, కొమ్ము శ్యామ్, ఆకుల రాజు, ఉమాకాంత్ తదితరులు ఉన్నారు.

## అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



**మిర్యాలగూడ అక్టోబర్ 5:–** మిర్యాలగూడ మండలం యాద్గారుపల్లి గ్రామంలో శ్రీకనకదుర్గ అమ్మవారి దేవి శరన్నవరాత్రుల మహోత్సవం సందర్భంగా మూడవరోజు శ్రీ కనకదుర్గ అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంతో ప్రజలకు దర్శనం ఇచ్చింది. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కర్త బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యాద్గారుపల్లి గ్రామంలో వెలిసిఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారు గత 24 సంవత్సరాల నుండి అమ్మవారు దేవాలయములో వైదిక విధి విధానంగా శ్రీ మహాకాళి శ్రీ మహాలక్ష్మి శ్రీ మహా సరస్వతి త్రిముత్తాత్మిక శ్రీ దుర్గా శరన్నవరాత్రి మహోత్సవములు భక్తిశ్రద్ధలతో పురస్కారంగా దేవిప్రేరణలచే గ్రామ పెద్దలు, ప్రజలు సంకల్పించి శరన్నవరాత్రులు జరుపుకోవాలని 9 రోజులు పూజాధి కార్యక్రమంలో పాల్గొని మనసా వాచా కర్మణా శ్రీ దుర్గాదేవిని సేవించి తరించాల్సిందిగా వారన్నారు. మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ దంపతులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు వారికి శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయం వైపు నుండి ఆలయ నిర్మాణకర్త బంటు వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానం చేశారు. పీటల మీద కూర్చున్న దంపతులు అప్పనబోయిన రామకృష్ణ దంపతులు పాక మధు దంపతులు పాక అంజయ్య దంపతులు, తిప్పన ప్రతాప్, దుండిగాల శివ, మండే మణిదీప్, ఊరుకొండ రవి, నక్క వెంకన్న పాల్గొన్నారు

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై పోరాడాలి

### సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రవినాయక్

**మిర్యాలగూడ అక్టోబర్ 5:–** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఎం. రవినాయక్ లు అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలం భగ్య గోపసముద్రం తండా సిపిఎం రెండవ శాఖ మహాసభ నిర్వహించారు. మహాసభల సందర్భంగా ఇటీవల మరణించిన అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి మహాసభలో ఘనంగా నివాళులర్పించారు. ఈ మహాసభల సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలను తెచ్చి రైతాంగ వ్యతిరేక కార్యక్రమం చేస్తు మత రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. బిజెపి అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రజల్లో మతతత్వాన్ని రెచ్చగొడుతూ నిత్యం దాడులకు ప్రేరేపిస్తుందని అన్నారు. మహిళలపై నిత్యం అత్యాచారాలు జరుగుతున్నాయని ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఎప్పటికైనా ప్రజలకు అండగా నిలబడి నికరంగా పోరాడి ప్రజలను హక్కులను కాపాడేది కమ్యూనిస్టులేనన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, భాగ్యనాయక్ , హుష్యా నాయక్, వినోద్ నాయక్, కస్నా నాయక్, బాబు, దేవిలాల్ పాల్గొన్నారు



# ఖాకీల్లో.. కలకలం

**నల్గొండ –నవభూమి:** ఇసుక అక్రమ రవాణా నియంత్రణలో వైఫల్యం చెందడంతో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పనిచేస్తున్న 15 మంది ఎస్సైలపై ఉన్నతాధికారులు వేటు వేయడం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది. మల్టీజోన్–2లో వేటు పడ్డ వారిలో ఉమ్మడి జిల్లా ఎస్సైలే అత్యధికంగా ఉండటం గమనార్హం. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక పాలసీపై విధాన నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రభుత్వ రీచుల నుంచి గత కొంత కాలంగా ఇసుక రవాణా నిలిచిపోయింది. దీంతో ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ల ద్వారా కొంత మంది అక్రమార్కులు ఉమ్మడి జిల్లాలోని మూసీ, కృష్ణా నది పరివాహక ప్రాంతాల వాగులు, వంకల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ల అండతో యథేచ్ఛగా ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారు. గతంలో తుంగతుర్తి నియోజకవర్గంలోని అడ్డగూడూరు, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, మోత్కూరు, మిర్యాలగూడ నియోజకవర్గంలోని వేములపల్లి, అడవిదేవులపల్లి, వాడపల్లి, నల్గొండ నియోజకవర్గంలోని కనగల్, తిప్పర్తి, నాగార్జునసాగర్‌లో హాలియా, సూర్యాపేటలో ఆత్మకూరు(ఎస్), పెన్‌పహడ్, మునుగోడులో చండూరు, ఆలేరులో గుండాల మండలాల్లోని వాగులు, రీచుల నుంచి ఇసుక సరఫరాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా.. కొంత మంది అక్రమార్కులు దానిని హైదరాబాద్‌కు తరలించేవారు. తుంగతుర్తిలోని వంగమర్తి రీచుతో పాటూ జాజిరెడ్డిగూడెం నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్‌కేంద్రానికి ఇసుక సరఫరా పేరుతో వేల లారీలను హైదరాబాద్‌కు తరలించారు. ప్రాజెక్టుల పేరుతోనూ అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగింది. కొత్త ప్రభుత్వంలోనూ ఇదే విధమైన ఎత్తుగడులు వేద్దామని ప్రణాళికలు రూపొందించినా ప్రభుత్వ విధానం, మూసీలో ఉద్ధృత ప్రవాహం ఉండటంతో అక్రమార్కుల ఎత్తుగడలు సాగడం లేదు. దీంతో కొన్ని రీచుల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను గట్టుపైకి తీసుకొచ్చి వాటిని లారీల్లో డంపు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఎప్పటికప్పుడు నిఘా వర్గాల ఆరా.. ఇసుక ఆదాయం ఉన్న పోలీసు స్టేషన్లలో పోస్టింగ్‌ల కోసం బాగా డిమాండ్ ఉంది. కొంత మంది రాజకీయ నాయకులు జిల్లా పోలీసు అధికారులపై ఒత్తిళ్లు తీసుకువచ్చి ఫలానా పోస్టింగ్‌లు ఇవ్వాలని సూచిస్తున్నారు. ఇటీవల నల్గొండ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో ఇసుక ఆదాయం ఉన్న మూడు పోలీసు స్టేషన్లకు పోస్టింగ్‌ల కోసం సదరు నియోజకవర్గ ప్రజాప్రతినిధిని ఆశ్రయించగా ఏకంగా ఒక్కో పోలీసు స్టేషన్‌కు నాలుగు నుంచి ఐదుగురికి సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారి ఏదో ఒక పేరుతో మాత్రమే సిఫార్సు లేఖ ఇస్తేనే పోస్టింగ్ ఇస్తామని స్పష్టం చేసినట్లు సమాచారం. మరికొంత మంది ప్రజాప్రతినిధులు పోస్టింగ్‌ల కోసం వచ్చే అధికారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు గతంలో లాగా కాకుండా జిల్లా ఎస్‌బీ విభాగంతో పాటూ రాష్ట్ర నిఘా విభాగం ఆదాయం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులపై ఎప్పటికప్పుడు నిఘా వేసి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఇటీవల వేటు పడ్డ అధికారులపై గత ఆరు నెలల నుంచి పక్కాగా సమాచారం సేకరించి జిల్లా ఉన్నతాధికారి ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపడంతో ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అక్రమ రవాణా అరికట్టనందుకే... ఇసుక అక్రమ రవాణా కట్టడిలో అక్రమార్కులకు అండగా ఉంటున్నారనే నివేదికల నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని భువనగిరి డివిజన్‌లో పనిచేస్తున్న మరికొంత మంది పోలీసు అధికారులపై త్వరలోనే చర్యలు ఉండనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా రాచకొండ పరిధిలోనే ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు ఇప్పటికే నిఘా వర్గాలు గుర్తించాయి. ఇప్పటికే నివేదికలు ప్రభుత్వానికి చేరాయని.. ఒకట్రెండు రోజుల్లో ఆదేశాలు వచ్చే అవకాశం ఉన్నట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి వెల్లడించారు.

## మాజీ కేంద్రమంత్రి కాకాకు నివాళి అర్పించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 5:–** మాజీ కేంద్ర మంత్రి కాక గుడిసె వెంకట్ స్వామి 95వ జయంతి సందర్భంగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మిర్యాలగూడ పట్టణంలోని వై జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాక వెంకట్ స్వామి తన జీవితం అంతా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం దర్పణం చేసిన గొప్ప నాయకులని అన్నారు. వారి జీవితం ఎంతో మంది నాయకులకు ఆదర్శమని అన్నారు. వారి బాటలోనే వారి కుమారులు, మనవళ్ళు నడుచుకుంటూ వారి సేవలను మరింత విస్తృతం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, కోడిరెక్క శౌరీ, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్ళపల్లి రవి, కొండలు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కాలనీలో దుర్గాదేవి పూజల్లో ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 5:–** మిర్యాలగూడ పట్టణంలోని 6వ వార్డ్ ఇందిరమ్మ కాలనీలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ శనివారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా కాకా జయంతి

**మిర్యాలగూడ నవభూమి, అక్టోబర్ 5:–** మాజీ కేంద్ర మంత్రి, కాక గుడిసె వెంకటస్వామి 95వ జయంతి సందర్భంగా శనివారం వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో నివాళులర్పించారు. సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డిఎఓ శ్రీనివాస్ శర్మ, డిటి హాజీ, జెఎ జామాల్,పురపాలక కార్యాలయంలో వెంకటస్వామి చిత్రపటానికి చైర్మన్ తిరునగరు భార్గవ్ పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్.హరిబాబు, డిటి కల్పన, ఆర్ఐలు సత్యనారాయణ, రామకృష్ణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఎం. శేషగిరిశర్మ, ఎంపిఓ ఎం. రమేష్, ఉపాధి ఎపిఓ కళావతి, ఎస్ఎ పాషా, జెఎలు పోషయ్య, ఫిరోజ్ లు పాల్గొన్నారు.





## గౌతమి గ్రామర్ స్కూల్

# రజతోత్సవ సంబరాలు

- సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి









**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి అక్టోబర్ 05** క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారానే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. పురపాలక కేంద్రంలో శనివారం స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్ లో గౌతమి గ్రామర్ స్కూల్ 25 వసంతాల రజతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా పట్టణ, మండల వ్యాప్తంగా ఉన్న ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లి విద్యావంతులుగా మార్చిన పాఠశాల గౌతమి గ్రామస్కులని ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రావుల జంగయ్య దంపతులు ఎమ్మెల్యేని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా చిన్న పాఠశాల గా నుండి ప్రారంభమైన గౌతమి గ్రామర్ స్కూల్ నేడు పట్టణంలోని తిరుగులేని విద్యా సంస్థగా పనిచేస్తుందని ఆయన అన్నారు, పదవ తరగతిలో ఉన్నత స్థానాలను సాధిస్తూ విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును తీసుకెళ్లే విధంగా గౌతమి పాఠశాల పని చేస్తుందని ఆయన తెలిపారు ఇన్ని రోజులుగా సహకరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ జి రామ్ దాస్ డాక్టర్ తడక యాదగిరి, అచ్చయ్య, పట్టణ మండల కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు భారత లవ్ కుమార్ పాక మల్లేష్ యాదవ్ డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు సామ మధుసూదన్ రెడ్డి జిల్లా నాయకులు అంబరీష్ రెడ్డి ఉప్పునూతల వెంకటేష్, నాయకులు రావుల అనిల్, బండి యాదగిరి, ఉపాధ్యాయుల బృందం బెనర్జీ, పాండురంగం, జ్యోతి, తదితరులు ఉన్నారు.

## శ్రమ ఆయుధమై..

# ఐదు ఉద్యోగాలు చేరువై..!

**గుండాల –నవభూమి:** ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనమైన ఈ రోజుల్లో ఒక ఏడాదిలో ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించి సత్తా చాటింది మందడి వాణి. భువనగిరి మండలం చందుపట్ల గ్రామానికి చెందిన మందడి నర్సిరెడ్డి, నవనీత దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించిన వాణి ప్రాథమిక విద్య నుంచి పదోతరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు. డిగ్రీ ప్రైవేటు కళాశాలలో చదివారు. 2007లో గుండాల మండలంలోని అంబాల గ్రామానికి చెందిన భీమిడి శేఖర్‌రెడ్డితో వివాహమైంది. భర్త ప్రోత్సాహంతో బీఈడీ, పీజీ పూర్తి చేశారు. కొద్ది సంవత్సరాలు ప్రైవేటు పాఠశాలలో విధులు నిర్వహించారు. తన ఇద్దరు పిల్లలను చదివిస్తూనే పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకున్నారు. ఈ ఏడాది గురుకుల పాఠశాలల ఉద్యోగాల్లో తెలుగు విభాగంలో టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలు సాధించారు. కీసరలోని మహాత్మాజ్యోతిరావు పులే గురుకుల కళాశాలలో జేఎల్‌గా చేరారు. ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్షలోనూ తెలుగు స్కూల్ అసిస్టెంట్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రథమ ర్యాంకుతో పాటు, తెలుగు పండిట్ గ్రేడ్–2లో సైతం జిల్లా ప్రథమ ర్యాంకు సొంతం చేసుకున్నారు. బీ భర్త ప్రోత్సాహంతోనే ఫలితాలు సాధించానని ఆమె తెలిపారు.



## బతుకమ్మ వచ్చినా.. మూటల్లోనే



**నకిరేకల్, –నవభూమి:** బతుకమ్మ పండగ మళ్లీ వచ్చింది.. గతేడాది పండగ కోసం తెచ్చిన బతుకమ్మ చీరల్లో మిగిలినవి పంపిణీకి నోచుకోవడం లేదు. ఏడాది నుంచి కార్యాలయాల్లో మూటల్లోనే మూలుగుతున్నాయి.చీరలు దుమ్ముపట్టి పోతున్నా.. వాటిపై ముసుగులు కప్పేస్తున్నారు. గత ఏడాది అక్టోబరులో అప్పటి ప్రభుత్వం మహిళలకు పండగ కానుకగా బతుకమ్మ చీరలు పంపిణీ చేసింది. పంపిణీ మొదలు పెట్టిన ఆరు రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చీరలు పంచడాన్ని నిలిపివేశారు.ఆ తర్వాత కొలువు దీరిన కొత్త ప్రభుత్వం చీరల పంపిణీపై నిర్ణయం తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. అప్పుడు పంపిణీ చేయకుండా మిగిలిన చీరలను పంచాయతీ, పుర కార్యాలయాలు, రేషన్ దుకాణాల్లో ఉన్నాయి. ఇలా మిగిలిన చీరల వివరాలను తొమ్మిది నెలల క్రితం అధికారులు సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు చీరల కానుకలను పంపిణీ చేయాలన్న యోచనలో ఈ ప్రభుత్వం ఉంది.బతుకమ్మ పండుగకు మహిళలకు ఏం ఇవ్వాలనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బుధవారం ప్రకటించడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో గతేడాది ఎన్నికల కోడ్ కారణంగా పంచకుండా మిగిలిన చీరలు లక్షల సంఖ్యలో ఉన్నాయి. 2023 అక్టోబరులో నకిరేకల్ మండలం, పురపాలికకు 21,250 బతుకమ్మ చీరలు రాగా కోడ్ అమల్లోకి వచ్చేనాటికి 6,657 చీరలను మాత్రమే పంపిణీ చేశారు. 14,593 చీరలు కార్యాలయాల్లోని మూటల్లో నేటికి మూలుగుతున్నాయి.నిల్వ ఉన్న చీరలపై తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి మార్గదర్శకాలు అందలేదని నకిరేకల్ పుర కమిషనర్ డి.బాలయ్య చెప్పారు.

## ఒక్క ఊరోళ్లముయ్యాలో.. ఒకటేమేమంత ఉయ్యాలో..

**న్యూస్‌టుడే, –నవభూమి:** ఒకే రకమైన చీరలు కట్టుకొని బతుకమ్మ ఆడుతున్న మహిళలు గ్రామాల్లో సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. బతుకమ్మ ఆటలో పేద, ధనిక అని భేదాభిప్రాయం లేకుండా ఉండేందుకు నూతన విధానం అమలు చేస్తున్నారు బీబీనగర్ మండల మహిళలు.గతంలో పట్టు వస్త్రాలు, నగలు ధరించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే వారు అలా పేద, ధనిక భేదం వస్తోందని భావించి మహిళలంతా ఒక్కటే అని చాటి చెప్పేందుకు బీబీనగర్ మండలంలోని మహాదేవపురం, కొండమడుగు, రహీంఖాన్‌గూడ, బీబీనగర్, వెంకిర్యాల గ్రామాల్లో పలువురు మహిళలు ఇలాంటి వేడుకకు వాట్సప్ గ్రూప్‌ల ద్వారా పిలుపునివ్వడంతో మిగతా మహిళలు కూడా అనుసరించారు. గ్రామాల్లో ఒక్క ఊరుల్లోముయ్యాలో.. ఒక్కటేమేమంత ఉయ్యాలో.. అంటూ పూల పండగను వైభవంగా జరుపుకొంటున్నారు.



# తుంగతుర్తి ఎమ్మెల్యేపై తిరుగుబావుటా

**సూర్యాపేట,నవభూమి:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌పై సొంత పార్టీ నేతలు తిరుగుబాటు జెండా ఎత్తారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ధరూరి యోగానందచార్యులు ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్లు అర్వపల్లి మండల కేంద్రంలోని శనివారం శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. కాగా, తెల్లవారుజామున నాలుగు గంటలకే అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు నియోజకవర్గవ్యాప్తంగా ముందస్తు అరెస్టు చేసి నూతనకల్ స్టేషన్‌కు తరలించారు.దాంతో కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. అధికార పార్టీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం పట్ల నియోజకర్గంలో తమను చూసే గాక ఎమ్మెల్యే తీరు కూడా నవ్వుల పాలయ్యేలా ఉందని ఆ పార్టీ సీనియర్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలు, ధర్నాలు, నిరసనలు చేపడితే ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టు చేయడం చూశాం గానీ.. స్థానిక ఎన్నికల కోసం చర్చించేందుకు సమావేశం పెట్టుకుంటే సొంత పార్టీ నేతలను అరెస్టు చేయించిన ఘనత మా ఎమ్మెల్యేకే దక్కిందంటూ యోగానందచార్యులు అసహనం వ్యక్తం చేశారు.

సామేల్‌ను తాము కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పార్టీ కేడర్‌ను కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్థానిక సమస్యలు, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేసుకుంటే అరెస్టు చేయిస్తారా అని ప్రశ్నించారు. తెల్లవారుజామున పోలీసులు కాంగ్రెస్ నాయకుల ఇండ్లపై పడి దొంగలను పట్టుకొచ్చినట్లు పట్టుకొచ్చి నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో నాలుగు గంటల పాటు నిర్బంధించడం మీద రాష్ట్ర నాయకత్వం స్పందించాలన్నారు. దీనిపై గాంధీభవన్ మెట్లు ఎక్కుతామని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యేపై వరుసగా రుసరుసలు**

తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్‌పై నియోజకవర్గ కాంగ్రెస్‌లో వరుసగా అసమ్మతి చెలరేగుతూనే ఉంది. ఎన్నికల సమయంలో తట్టెడు ఇసుకను కూడా ఎత్తనివ్వనని ఊరూరా తిరిగి ప్రచారం చేసిన ఆయన ఎమ్మెల్యే అయిన తరువాత లారీల కొద్దీ ఇసుక అక్రమంగా తరలుతున్నా కనీసం పట్టించుకోకపోవడం లేదని ఆ పార్టీ నేతలు బహిరంగా విమర్శించారు. మరోవైపు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తుంగతుర్తిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ తన కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించడం గమనార్హం. తాజాగా గురువారం శాలిగౌరారం ఓ వ్యక్తి ఎమ్మెల్యే చెప్పడంతోనే పోలీసులు తనను కొట్టారంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సంచలనంగా మారింది. ఆ మరుసటి రోజే సొంత పార్టీ నాయకుల ముందస్తు అరెస్టులతో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరుకున్నట్లు అయ్యింది.

## దేశానికి రోల్‌మోడల్‌గా కొత్త రెవెన్యూ చట్టం

**హాలియా–నవభూమి** : ప్రస్తుతం ఉన్న రెవెన్యూ చట్టంలో మార్పులు చేసి దేశానికి రోల్‌మోడల్‌గా ఉండేలా నూతన చట్టాన్ని తీసుకువస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలో కొత్త రెవెన్యూ చట్టం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన తిరుమలగిరి (సాగర్) మండలంలోని నెల్లికల్లులో శనివారం రైతులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గతంలో తెచ్చిన 2020 రెవెన్యూ చట్టం, ధరణి వల్ల రైతులు, ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.వాటిని సవరించి, దేశంలోని అన్ని రెవెన్యూ చట్టాలను పరిశీలించి మెరుగైన రెవెన్యూ చట్టం తీసుకువచ్చేందుకు ప్రజల అభిప్రాయాలను సేకరించి పబ్లిక్ డొమైన్‌లో ఉంచినట్లు తెలిపారు. ప్రజలు, ప్రతిపక్షాల సూచనలు సైతం పరిగణలోనికి తీసుకొని అతికొద్ది రోజుల్లో నూతన చట్టం తీసుకువస్తామన్నారు. తిరుమలగిరి(సాగర్) మండలంలో కొంతమంది పొజిషన్‌లో ఉన్నా పట్టాలు లేవని, పట్టాలు ఉన్న వారికి భూమి లేదని తెలిపారు.

## అభివృద్ధి చేతకాక అరాచకాలకు


# పాల్పడుతున్న కాంగ్రెస్

**సూర్యాపేట–నవభూమి:** రాష్ట్ర అభివృద్ధి చేతకాక, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీషరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురు సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులు, బీఆర్‌ఎస్ ప్రమాద బీమా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్‌ది నిర్మాణాత్మక ఆలోచన అని, కాంగ్రెసది కూలగొట్టే అరాచక పాలన అని దు య్యబట్టారు. ఇళ్లు ఇస్తారని నమ్మి ఓట్లు వేస్తే, ఉన్న ఇళ్లు కూలగొడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా రైతు భరోసా లేకపోగా, ఉన్న రైతుబంధు కూడా ఇస్తలేరన్నారు. హామీలను గాలికొదిలేసి అభివృద్ధిని అటకెక్కించి ఇష్టానుసారంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు ప్రజా సమస్యలను పరిష్కరించకపోగా, వాళ్లే ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి చేసిందెవరో, ఆగం చేస్తున్నదెవరో ప్రజలు గమనిస్తున్నారని స్పష్టంచేశారు. త్వరలోనే ప్రజలు మంచి, చెడును నిర్ణయిస్తారని చెప్పారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అని స్పష్టంచేశారు. సమావేశంలో వై. వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాసగౌడ్, పుట్టా కిశోర్‌కుమార్, మారిపెద్ది శ్రీనివాసగౌడ్, జీడి భిక్షం, వంగాల శ్రీనివాసరెడ్డి, దొంగరి యుగంధర్, తూడి నర్సింహారావు, రౌతు నర్సింహారావు, సుంకరి రమేష్, బత్తుల జానీయాదవ్, అంజయ్య, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి, నగిరె సుదర్శన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి కరాటే పోటీల్లో సూర్యాపేట విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి సూర్యాపేటతోపాటు రాష్ట్రానికి పేరు తేవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీషరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల వరంగల్‌లో కియో జపాన్ చోటోఖాన్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ లో మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ వరల్డ్ ఫెడరేషన్ ఇండియా తెలంగాణ రాష్ట్ర చీఫ్ షేక్ సయ్యద్, తాహేర్‌పాష, రియాజుద్దిన్, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రిలో వైభవంగా గిరి ప్రదక్షిణ





**యాదగరిగుట్ట:-నవభూమి:** యాదాద్రి పుణ్యక్షేత్రంలో శనివారం ఉదయం భక్త జనులు 'గిరి ప్రదక్షిణ' చేపట్టారు. యాదాద్రీశుడైన నారసింహుడి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈ గిరి ప్రదక్షిణ నిర్వహించింది. ఇందులో పాల్గొనేందుకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. తొలుత వైకుంఠ ద్వారం వద్ద పూజలు చేసి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయ ఈవో భాస్కరరావు, ధర్మకర్త నరసింహమూర్తి, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్త బృందాలు పాల్గొన్నాయి.

## వైభవంగా ఊంజల్ సేవోత్సవం

**యాదగిరిగుట్ట, -నవభూమి:** యాదాద్రి పుణ్యక్షేత్రంలో నిత్యారాధనలతో పాటు అమ్మవారి సంప్రదాయ ఆరాధనలను ఆలయ ఆచారంగా కొనసాగించారు. శుక్రవారం సూర్యోదయానికి ముందస్తే గర్భాలయంలో కొలువుదీరిన పంచనారసింహులను మేల్కొలిపే క్రతువును సుప్రభాతం ద్వారా చేపట్టిన పూజారులు స్వయంభువులను హారతి నివేదనతో కొలిచారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వర్ణమూర్తులను బంగారు పుష్పాలతో ఆరాధించారు. ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను ఆరాధిస్తూ స్వర్ణ పుష్పాలతో నిత్యార్జిత అర్చనా పర్వాన్ని కొనసాగించారు. అష్టభుజి మండప ప్రాకారంలో శ్రీ సుదర్శన నారసింహహోమం, శ్రీలక్ష్మీనారసింహుల నిత్యకల్యాణాన్ని శాస్త్రానుసారంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ లక్ష్మీదేవిని ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్ది ఊంజల్ సేవా పర్వాన్ని చేపట్టారు. అద్దాల మండపంలోకి చేర్చి ఊంజల్ సేవా కైంకర్యాన్ని వేదమంత్ర పఠనాల మధ్య నిర్వహించారు. శ్రీస్వామి, అమ్మవార్ల అలంకార సేవోత్సవం నిర్వహించారు. రాత్రి స్వయంభువులను ఆరాధిస్తూ ప్రత్యేక ఆరాధన, సహస్రనామార్చన జరిపారు. నేడు యాదాద్రిలో స్వాతి నక్షత్రోత్సవం. యాదాద్రి పుణ్యక్షేత్రంలో శనివారం స్వాతి నక్షత్రం వేడుకలు నిర్వహిస్తారు. నరసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా శనివారం ఉదయం గర్భాలయంలోని మూలవరులకు అష్టోత్తర శతఘటాభిషేకం చేపడతారు. ఈ వేడుకలో భాగంగా వేకువజామునే భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు.



### 48 గంటల్లో రైతు ఖాతాల్లో

# నగదు జమ: కలెక్టర్



**సూర్యాపేట -నవభూమి:** కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. వానాకాలం 2024-25 ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయ అధికారులు, ఐకేపీ, మెప్మా, పీఏసీఎస్, డాటా ఎంట్రీ ఆపరేటర్లతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరపై రూ.500 బోనస్ చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వడ్ల రకంపై సందేహాలు వస్తే ధాన్యం పొట్టు తీసి మైక్రోమీటర్ ద్వారా చూడాలన్నారు. తేమ కొలిచే, ధాన్యం శుద్ధి చేసే యంత్రాలు, మైక్రోమీటర్, ట్యాబ్, గన్నీ సంచులు, తాగునీరు, హమాలీలు, టార్పాలిన్లను సమకూర్చుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ బీఎస్.లత, డీఆర్డీవో అప్పారావు, జిల్లా సివిల్ సప్లై డీఎంటీఎస్ ప్రసాద్, డీఏవో శ్రీధర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి...తుంగతుర్తి మండలంలోని గ్రామీణ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తుంగతుర్తి నియోజవర్గంలోని వేలాది మంది ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం తుంగతుర్తి మండలం వెలుగుపల్లి ఆవాసం మల్లన్నగుట్ట వద్ద ఉన్న ప్రభుత్వ స్థలం, సమీపంలోని రుద్రమ్మ చెరువును రిజర్వాయర్ ఏర్పాటుకు అక్కడి పరిసరాలను వారు పరిశీలించారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ చరవాణిలో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కావల్సినంత స్థలం అందుబాటులో ఉందని, త్వరలో నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ఉపయోగకరంగా ఉండే భూమిని నిర్ధారిస్తామని పేర్కొన్నారు. ఇక్కడి వారు అమెరికాకు ఉద్యోగాల కోసం వలస పోతుంటే అక్కడి వారు ఇక్కడికి వచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేయడం శుభపరిణమమని ఎమ్మెల్యే సామేల్ తెలిపారు. ఏడాది కాలంలో ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయించడమే తన లక్ష్యమని చెప్పారు. వారి వెంట జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ నాగరాజు, తహసీల్దార్ దయానందం, ఎంపీడీవో శేషుకుమార్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, కాంగ్రెస్ నాయకులు సుంకరి జనార్దన్, గోవర్ధన్ ఉన్నారు.

# ఉపాధి ప్రణాళికలు షురూ

**భువనగిరి, -నవభూమి:** ఉపాధిహామీ పథకం గ్రామీణ కూలీలకు కొన్నేళ్లుగా చేతినిండా పని కల్పిస్తుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రతిఏటా నూతన పనుల గుర్తింపు ప్రక్రియ చేపట్టి పరిపాలన ఆమోదానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. ముఖ్యంగా వలసల నివారణకు ఉన్న గ్రామాల్లోనే పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిరుపేదలకు బాసటగా నిలుస్తుంది. భూగర్భ జలాల పెంపు పనులకు ప్రాధాన్యం..పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడా మైదానాలు వంటి పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, వ్యవసాయ బావులకు రహదారి నిర్మాణాలు, కట్టుకాల్వల పనులను చేపట్టారు. ఈ సారి భూగర్భజలాలు పెంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకు పనులు గుర్తించడంతో పాటు ప్రజల అంగీకారం తప్పనిసరి కావడంతో ఇప్పటి నుంచే ప్రక్రియ చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పనులకయ్యే ఖర్చు వివరాలు తయారుచేసి పంపించాల్సి ఉంటుంది. ఆ వెంటనే తీర్మానాలను ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆమోదం రాగానే...ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాల్లోని 1740 గ్రామ పంచాయతీలలో ఈ నెలాఖరులోపు గ్రామసభలు పూర్తి చేసి, నవంబరులో మండలాల వారీగా ప్రణాళిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. వాటిని క్రోడీకరించి రాష్ట్రస్థాయిలో ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. పరిపాలన ఆమోదం వెంటనే గ్రామాల్లో సదరు పనులను ఉపాధికూలీల ద్వారా చేపట్టనున్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనుల తీరుపై ప్రణాళికల రూపకల్పనకు ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమ్మతితో పనులు గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయమై గాంధీ జయంతి రోజు నుంచి ఈ గ్రామసభల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరు వరకు పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈసారి భూగర్భ జల వనరుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

